క్లుప్తంగా

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..



మహబూబాబాద్: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రమాదవశాత్తు మరణించిన ఆరు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పురస్కారం అందజేత



డోర్నకల్: ఏపీకి చెందిన స్వచ్ఛంద సంస్థ తెలుగు వెలుగు సాహితి సంస్థ ద్వారా డోర్నకల్‌కు చెందిన వీరబోయిన ఉపేందర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఫొటోగ్రాఫర్ వీరబోయిన ఉపేందర్ దశాబ్ద కాలంగా గాయకుడిగా రాణిస్తున్నాడు. ఏపీలోని గుంటూరులో ఆదివారం తెలుగు వెలుగు సంస్థ ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య, నృత్య సమ్మేళనం నిర్వహించి తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాకారులను జాతీయ స్థాయి పురస్కారాలతో సన్మానించారు.

సన్మానం

మరిపెడ: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని క్లబ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒక పేద ఆర్యవైశ్యుడికి బియ్యం, కిరాణ సామగ్రి పంపిణీ చేశారు. అదేవిధంగా ఒక రైతుకు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు అందజేశారు. పోలీస్‌శాఖలో సేవలందించిన ఒకరిని సన్మానించారు. క్లబ్ జిల్లా గవర్నర్ రవ్వ గీత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మరిపెడ రూరల్: సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామసహాయం సత్యనారాయణరెడ్డి అన్నారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన పోలెపాక వెంకటమ్మకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కును సత్యనారాయణరెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాదూరి రాంచంద్రరెడ్డి, దిగజర్ల ముఖేష్, ఉపసర్పంచ్ దయ్యాల లింగస్వామి, పార్టీ అధ్యక్షుడు సీత వెంకన్న, సీత వీరభద్రం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లికి ఆషాఢ మాసోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఆదివారం బోనాలను సమర్పించుకున్నారు. సర్పంచ్ కాలం తిరుపతిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చెన్నబోయిన ఉపేందర్, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఆహా ఆరుద్ర..



కొత్తగూడ: ఆకర్షించే ఎర్రటి రంగులో.. ఎంతో మృదువుగా పొలాల్లో కనిపించే అందమైన కీటకాలు ఆరుద్ర పురుగులు. ఇవి కేవలం ఆరుద్ర కార్తెలో మాత్రమే కనపించడం వల్లే వీటికి ఈ పేరు కలిగినట్లు ప్రతీతి. ఆదివారం పొలాల్లో ఆరుద్ర పురుగులు కనిపించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాముకాటుతో గేదె మృతి

కేసముద్రం: పాము కాటుకు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కల్వల గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సయ్య అనే రైతుకు చెందిన పాడి గేదెను ఇంటి ఆవరణంలో ఎప్పటిలాగే కట్టేసినట్లు తెలిపారు. పాము కాటుకు గురైన గేదె నోటి వెంట నురుసులు కక్కుతూ మృతి చెందినట్లు తెలిపారు. సుమారు రూ.50వేల విలువ చేసే పాడిగేదె మృతి చెందినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ పనుల్లో నిర్లక్ష్యం

- విద్యుత్ సామగ్రి తరలింపునకు రైతులే వాహనాలు తెచ్చుకోవాలని ఒత్తిడి
- ప్రారంభం కానున్న వ్యవసాయ సీజన్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

డోర్నకల్: రైతుల వ్యవసాయ భూముల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో బావులు, బోరుబావులు కలిగిన రైతులు విద్యుత్ లైన్లు, కనెక్షన్ల కోసం చాలా రోజుల క్రితం విద్యుత్‌శాఖకు రూ.5,295 నగదును డీడీల రూపంలో చెల్లించారు. మండలంలో సుమారు 30మంది రైతుల వ్యవసాయ భూముల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినా నేటికీ స్తంభాలకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయలేదు. కొంతమంది డీడీలు చెల్లించినా నేటికీ కనీసం స్తంభాలను కూడా ఏర్పాటు చేయలేదు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనులలో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు డీడీలు చెల్లించిన తరువాత విద్యుత్ స్తంభాలు, వైర్లతో పాటు ఇతర ఇతర సామగ్రిని



విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో విద్యుత్ పరికరాలు



పాతిన స్తంభాలు

విద్యుత్ లైన్ల వద్దకు కాంట్రాక్టరే తరలించాల్సి ఉంది. కాని సంబంధిత కాంట్రాక్టర్ సామగ్రి తరలింపు కోసం వాహనాలను రైతులే తెచ్చుకోవాలని ఒత్తిడి తెస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉండటం, విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులకు గురి చేశారు..



విద్యుత్ స్తంభాల తరలింపు కోసం వాహనాన్ని తెచ్చుకోవాలని కాంట్రాక్టర్ చెబితే మూడుసార్లు ట్రాక్టర్, కూలీలతో వెళ్లినా సామగ్రి ఇవ్వలేదు. మిగతా సామగ్రి కోసం ఆటోతో డోర్నకల్‌కు వెళ్లాలంటూ కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేశాడు.

- మారెడ్డి సీతారెడ్డి, రైతు, పెరుమాళ్ల సంకీస

త్వరితగతిన పూర్తి చేయిస్తాం

వ్యవసాయ భూముల్లో విద్యుత్ లైన్ల పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించాం.

- కె.కిరణ్, విద్యుత్ శాఖ ఏఈ, డోర్నకల్

బీటీ రోడ్లతో తండాలకు మహర్దశ

- ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

గార్ల: బీటీ రహదారుల నిర్మాణం చేపట్టడంతో గిరిజన తండాలకు మహర్దశ వచ్చిందని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తితండా, చాంప్లాతండాలకు రూ.2.30కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో బీటీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారం చేపట్టాక తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, తండాలకు బీటీ రహదారులు నిర్మించారని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో పోడు రైతుల కల నేరవేరనుందన్నారు. జూలై 1వ తేదీ నుంచి పోడు భూములను సాగు చేసుకునే ఆదివాసీ గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం సర్వం సిద్ధం చేసిందన్నారు.

పరామర్శ..

ఈనెల 22న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల చివరి రోజున గార్ల లోని నెహ్రూసెంటర్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ శివాజీచౌహాన్‌పై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఎంపీపీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎంపీపీ పై దాడికి పాల్పడ్డ నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్‌లు భూక్యా బుజ్జి రాములు, ధరావత్ సక్రు, భారతి, శ్రీను, ఎంపీటీసీ రమేష్, కోఆప్షన్ ఖదీర్ పాల్గొన్నారు.



బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ముత్తితండాకు వచ్చిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.హరినాయక్ వినతిపత్రం అందజేశారు.

బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: నేడు ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులపై కోర్టు తీర్పు ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వం తరఫున న్యాయవాదిని పంపి సత్వరమే బదిలీలు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చాలా పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలు ఉండి, ఎంతో మంది విద్యార్థులకు విద్య అందక నష్టపోతున్నారని, ప్రభుత్వ విద్యా వ్యవస్థంటే రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు లేదని ఆయన ప్రశ్నించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ. జిల్లాలో చేపట్టబోయే ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా జరగాలన్నారు.



మాట్లాడుతున్న చుంచు శ్రీశైలం

ఉపాధ్యాయుల ఖాళీ పోస్టుల స్థానంలో కనీసం విద్యావలంటీర్లను నియమించాలని, పాఠ్య పుస్తకాలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు తండా సందానందం, సోమ గోవర్ధన్, ఉపాధ్యక్షులు సోమారపు ఐలయ్య. ఎండి.సైదులుపాషా, బలాష్టి రమేష్, వి.సువర్ణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలి



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్: తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని దగాపడ్డ తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు, కేయూ పూర్వ జేఏసీ నాయకులు సాదు రాజేష్, రాజు, వీరస్వామి, రాజేందర్, వీరస్వామి డిమాండ్ చేశారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఆదివారం నాయకులు నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల కోసం ప్రభుత్వ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, తిరుపతి, అనిల్, నీలేష్‌రాయ్, ఇనుగుర్తి సుధాకర్, నరేష్, కొమురయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలి

గార్ల: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో ఇల్లందు నియోజకవర్గంలోని యువతీ, యువకులు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు ఆదివారం మండలం లోని గోపాలపురం గ్రామంలో క్విజ్ పోటీ అంశాల కరపత్రాలను ఆయన ఇంటింటికీ పంచుతూ ప్రచారం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అఖిల భారత కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ప్రవేశ పెట్టిన యూత్ డిక్లరేషన్‌లో భాగంగా యువత మేథోశక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర చరిత్ర ఆవశ్యకత గురించి జూలై 2వ తేదీన నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో నియోజకవర్గం నుంచి యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, ఎంపీటీసీ రాజకుమారి, అధ్యక్షుడు జలీల్, కోటేశ్వరరావు, హరీశ్, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఐలయ్య

పెద్దవంగర: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి వివరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, నాయకులు దుంపల సమ్మయ్య, పాకనాటి ఉపేందర్ రెడ్డి, సర్పంచ్‌లు గుగులోత్ పటేల్ నాయక్, ధరావత్ రాజేందర్ పాల్గొన్నారు.

ప్రజాయుద్ధ పంథా రూపశిల్పి డీవీ కృష్ణ

నెహ్రూసెంటర్: భారత విప్లవ ప్రజాయుద్ధ పంథాను రూపొందించి తుది వరకు విప్లవోద్యమానికి కృషి చేసిన డీవీ కృష్ణను ప్రజలు ఎన్నటికి మర్చిపోరని ప్రజాపంథా సహాయ కార్యదర్శి పైండ్ల యాకయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో కృష్ణ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దొడ్డ రాజు, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నాయకులు

వనభోజనాల సందడి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారు గుండ్ల బోడు తండాలో గిరిజనులు సంప్రదాయబద్ధంగా ఆదివారం వనభోజనాలకి వెళ్లారు. యువకులు, మహిళలు, పిల్లలు చిన్నారులు ఎంతో ఆనందంతో అందరూ కలిసికట్టుగా వారి కులదేవతలను ప్రార్థిస్తూ వర్షాలు బాగా పడాలని పంటలు బాగా పండాలని వేడుకున్నారు. జూలై 11న అందరూ ఒకే రోజు సీత్ల పండుగను జరుపుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ పిలుపునిచ్చారు.



వనభోజనాల్లో తండావాసులు

యువతరం ఉద్యమించాలి

కురవి: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం యువతరం ఉద్యమించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రాజోలు గ్రామంలో పీవైఎల్ కురవి, డోర్నకల్ మండలాల సంయుక్త మహాసభ నిర్వహించారు. అనంతరం 11మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాంకుడోత్ రాములు, ఉపాధ్యక్షుడిగా బాలెం వెంకటేశ్, కార్యదర్శిగా నాగుబండి శంకర్‌రావు, సహాయ కార్యదర్శిగా బోడ సురేష్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ఎస్‌కె బాబన్న, నాయకులు అఖిల, నరేష్, దేవేందర్, వెంకన్న, ప్రభాకర్, హనుమయ్య పాల్గొన్నారు.

పర్యవేక్షణ ప్రభుత్వ అధికారులకే ఇవ్వాలి

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం పాఠశాలలను స్వచ్ఛంద సంస్థలకు తనిఖీ చేసే అధికాన్ని రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను ప్రైవేటీకరణ చేసే దిశగా ముందుకు సాగుతుందని, విద్య వ్యవస్థను సమాజంలో చిన్నచూపు చూసేవిధంగా ఉందని పేర్కొన్నారు. పర్యవేక్షణ అధికారాలు ప్రభుత్వ అధికారులకే ఇవ్వాలని లేనిచో ఉద్యమాల కోసం ఉపాధ్యాయ సంఘాలు సిద్ధంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సతీష్, కార్యదర్శి దేవేందర్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువలో ఆర్టీసీ సేవలు

నెల్లికుదురు: ప్రజలకు మరింత దగ్గరగా తీసుకొస్తున్న ఆర్టీసీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ బీర్రు అయిలయ్య కోరారు. మండలంలోని మధనతుర్తి గ్రామంలో మహబూబాబాద్ డిపో మేనేజర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ సౌకర్యాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ సౌకర్యం మెరుగు పరిచేందుకు ఆర్టీసీ బస్‌లను పునరుద్ధరణ చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో నెల్లికుదురు నుంచి వరంగల్, ఖమ్మం వెళ్లేందుకు ప్రారంభించే సర్వీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు 60 కిలోమీటర్లు తిరిగే రూ.100 పాస్‌ను వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ అనిల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేసముద్రం: 1988-1989 బ్యాచ్ విద్యార్థులు

కేసముద్రం: కేసముద్రం స్టేషన్ జెడ్పీఎస్ఎస్‌కి చెందిన 1988–1989 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు, తమ ఫ్యామిలీ మెంబర్స్‌తో మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటు సంతోషంగా గడిపారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1976–77 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



మహబూబాబాద్ అర్బన్: 1976-77 బ్యాచ్ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

కుక్కదాడిలో ఇద్దరికి గాయాలు



కేసముద్రం: కుక్క దాడిలో ఇద్దరి మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని ఇంటికన్నె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నార్లాపురం వీరలచ్చమ్మ అనే మహిళ ఉదయం తన ఇంటి ముందు అరుగుపై పడుకోవడంతో పెంపుడు కుక్క ఆమె ముఖంపై కరిచింది. ఇదే గ్రామానికి చెందిన టేకుల యాకమ్మను కూడా అదే కుక్క చేతిపై కరిచింది. వారిద్దరిని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మరిపెడ రూరల్: బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని ఎడ్జెర్ల స్టేజి సమీపంలోని మహబూబాబాద్-సూర్యాపేట 365 జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. కథనం ప్రకారం.. కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన సంకూరి మునేందర్ ఓ పని నిమిత్తం మరిపెడ బంగ్లాకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎడ్జెర్ల స్టేజి వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో మునేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుకలారీల పట్టివేత

బయ్యారం: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను ఆదివారం బయ్యారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా నుంచి మహబూబాబాద్‌కు రెండు లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు బయ్యారంలో ఎస్సై రమాదేవి తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇసుకలోడుతో వెళ్తున్న రెండు లారీలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జయప్రదం చేయండి

బయ్యారం: ఈనెల 29న బయ్యారంలో నిర్వహించనున్న పీవైఎల్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, సురేష్ పిలుపునిచ్చారు. మహాసభ విజయవంతం కోరుతూ ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అన్వేష్, నిరంజన్, సైదులు, వెంకటేష్, మంగీలాల్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కురవి: కలెక్టరేట్ ముట్టడిని (నేడు సోమవారం) విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వీరేందర్, మురళీ, గణేష్, వాసు పాల్గొన్నారు.

ఎంఈఓను సస్పెండ్ చేయాలి

కురవి: ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న ఎంఈఓ పూల్‌చంద్‌ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్స్‌లో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నా పట్టించుకోవడంలేదని తెలిపారు.

బెల్లం పానకం ధ్వంసం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామ శివారు భజన తండాలో రూరల్ పోలీసులు ఆదివారం సాయంత్రం పొలాల్లో దాచి ఉంచిన 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తండావాసులు తమ ఇండ్లలో గుడుంబా కాస్తే పోలీసులకు సమాచారం అందుతుందని పంట పొలాల సమీప ప్రాంతాల్లో గుడుంబా బట్టీలు పెట్టి బెల్లం పానకం తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రూరల్ ఎస్సై రాంచరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ రాజు భజన తండ శివారుకు వెళ్లి బెల్లం పానకం ధ్వంసం చేశారు.

ఆర్థికసాయం

కేసముద్రం: కేసముద్రం విలేజికి చెందిన అమీర్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు 1982–83 బ్యాచ్‌కు చెందిన ఎస్సెస్సీ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.26వేల ఆర్థికసాయాన్ని ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మంచన మనోహర్, సంజీవరెడ్డి, కోటేశ్వర్లు, సాంబమూర్తి పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. కురవి మండలం తట్టుపల్లికి చెందిన మునీందర్ ద్విచక్రవాహనంపై గొల్లచర్ల వైపు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తుండగా సబ్‌స్టేషన్ సమీపంలో పశువు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. 108వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి రూ.5లక్షల చెక్కు అందజేత



కురవి: సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన పామర్తి అంజయ్య కొన్ని నెలల క్రితం తాటి చెట్టు నుంచి కిందపడిపోవడంతో కాలు విరిగింది. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా చెక్కును ఎక్సైజ్ అండ్ స్పోర్ట్స్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందించగా ఆ చెక్కును ఎక్సైజ్ శాఖ అధికారులు గీత కార్మికుడికి అందచేశారు.

పద్మశాలీ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం పట్టణ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చిట్యాల వీరన్న, సంఘం యూత్ మండల అధ్యక్షుడిగా చెలమ్ల కిరణ్ ఎన్నికైనట్లు సంఘం పెద్దలు పేర్కొన్నారు. ఈమేరకు ఎన్నికైన నూతన కమిటీని మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్, మార్కెట్ డైరెక్టర్ జాటోత్ హరీష్‌నాయక్‌లు అభినందించి సన్మానించారు.

హక్కుల కోసం పోరాడాలి



పెద్దవంగర: రజకులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని రజక సంఘం మండల అధ్యక్షుడు బోనగిరి లింగమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లక్ష రూపాయల పథకాన్ని రెండు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశాడు. రజకబంధు ద్వారా కుటుంబానికి రూ.5లక్షలు ఇచ్చి రజక ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎదునూరి సమ్మయ్య, చిన్నన్న, భిక్షం, యాకయ్య, మహేష్, ఎర్రన్న, నిరంజన్, చరణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.